ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 13-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది ఆత్మే. సృష్టిఅంతాకూడా ఆత్మలోనే ఉంది. ఆత్మ కనబడతుందా అని అడుగుతున్నారు. ఆత్మకు నామంలేదు, రూపంలేదు. అది నీకంటికి కనబడదు. నీ కళ్ళకు కనిపించేది అంతా నశిస్తుంది. ఆత్మ నీమాటలకు, మనస్సుకు, ఊహలకు అందకపోవచ్చును. ఆత్మ అనుభవైకవేద్యం. అది నీ అనుభవానికి అందుతుంది. నీ శరీరము నీకు ఎలా అనుభవంలో ఉందో అంత ప్రత్యక్షంగా ఆత్మనీకు అనుభవంలోనికి వస్తుంది. అది నీ అనుభవానికి అందిన తరువాత ఈ సృష్టిఅంతావచ్చి ఆత్మలేదని చెప్పినా నువ్వు అంగీకరించవు.

మనం అందరము సంసార యంత్రంలో తగులుకొన్న బొమ్మలము. ఈబొమ్మల హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. వాడు పరిపూర్ణుడు, దోషరహితుడు, ఆదిపురుషుడు. ఈ బొమ్మలను చూసి మురిసిపోకండి. ఈ బొమ్మలలోపల అంతర్యామిగాఉన్న ఈశ్వరుడిని పట్టుకోండి. మినహాయింపులు లేకుండా ఆయనను శరణువేడుకోండి. అప్పుడు మీరు ఈసంసారయంత్రంనుండి బయటకు వస్తారు. ఆయన స్వరూపమును పొందుతారు. ఇదంతా నావలన అవుతోంది, నేను చేస్తున్నాను అని అనుకోవద్దు. దానివలన అహంకారం పెరుగుతుంది. నువ్వు పాడైపోతావు. నీవు అన్నివిధములుగా ఈశ్వరుడుని శరణువేడుకో. ఇదంతా ఈశ్వరుని కరుణ అనుకో. నీవలన ఏమీ అవ్వదు. ఒకవేళ నీ శరీరంద్వారా ఏదైనా మంచి జరిగినా అది పరమేశ్వరునిద్వారా జరుగుతుందిగాని నీ తెలివివలన కాదు. అహంకారమును పెంచుకొని నీవు పాడైపోవద్దు. అన్నిరకములుగా ఈశ్వరుడిని శరణు వేడుకుంటే ఈ శరీరంలో ఉండగానే శాశ్వతమైన శాంతిని, శాశ్వతమైన సుఖాన్ని పొందుతావు. ఈ బొమ్మలనుచూసి మురిసిపోకుండా ఈ బొమ్మలలోపల ఉన్న ఈశ్వరుడిని శరణువేడుకుంటే తిరిగి ఈభూమిమీదకు రానటువంటి పదవిని పొందుతావు. సముద్రంమధ్యలోపడితే ఒడ్డు కనబడదు. ఈ సంసార సముద్రంలో ఉన్ననీకు, సంసారయంత్రంలో తగులుకొన్న జీవకోటికి ఈశ్వరుడిని శరణు వేడుకోవటంవలన ఒడ్డు కనబడుతుంది. కేవలం నీ తెలివితేటలవలన ఒడ్డుకు రాలేవు. భగవంతుని శరణు వేడుకోవటంవలన ఒడ్డుకు వచ్చేస్తావు.

గాలివాన వచ్చినపుడు బయట నిలబడి ఉంటే గాలి ఎటుగెంటితే అటు వెళ్ళిపోతాము. మనం స్వతంత్రముగా వ్యవహరించలేము. లోకంలోఉన్న బొమ్మలుకూడా వాటి ప్రారబ్ధానుసారము విసిరివేయబడుతున్నాయి. ఆ బొమ్మలలో అంతర్యామిగా నేను ఉన్నాను. ఎక్కడో ఉన్నాను అనుకొంటున్నావేమో ఆ బొమ్మల హృదయంయొక్క లోతులలో స్థిరంగా, సిద్ధంగా ఉన్నాను. ఏబొమ్మ అయితే మినహాయింపులు లేకుండా, శేషంలేకుండా నన్ను ఆశ్రయిస్తుందో ఆబొమ్మకు మాత్రమే నేను తెలియబడతాను. అందరికి తెలియబడను అని భగవంతుడు చెపుతున్నాడు. హృదయంలోఉన్న అంతర్యామి నువ్వేఅన్న సంగతి తెలుసుకోవటమే జీవితగమ్యం. శరీరం మరణించిన తరువాత బంధువులు మారతారు, పరిసరాలు మారతాయి. ఈశ్వరుడే నీకు పెద్దచుట్టం. మరణానంతరము ఈ చుట్టాలు ఎవరూ నీకూడా రారు. కాని పెద్దచుట్టం

అంటే ఈశ్వరుడు నీకూడా వస్తాడు. వాడు తెలియనంతవరకు నిన్ను ఈ సంసారయంత్రంలో త్రిప్పుతూ ఉంటాడు. వాడిని పట్టుకొన్న మరుక్షణంలో ఈ మాయలోనుండి నీవు బయటకు వచ్చేస్తావు. అంతర్యామిని నేనే, వాడికి నాకు బేధంలేదు అని తెలుసుకోవటమే నీజీవితగమ్యం. అంతర్యామిని నేనే అని నోటితో చెపితే సరిపోదు. అది నీ అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అనుభవంలోనికి తెచ్చుకోవాలంటే మాటలవలన, నదులలో మునగటంవలన అనుభవం రాదు. నీ బుద్ధిని నిర్మలం చేసుకోవాలి, నీ మనస్సును ఏకాగ్రం చేసుకోవాలి అప్పుడుగాని అంతర్యామిని నేనేఅన్న సంగతి నీకు అనుభవంలోనికి రాదు.

నీ హృదయంలోఉన్న ఈశ్వరుడు నీకు తెలియకపోవచ్చును. కనీసం వాడు ఉన్నాడు అన్న విశ్వాసంకూడా నీబుద్ధికి రావటంలేదు. ఇటువంటి పాడుబుద్ధికి వాడు తెలియబడడు. ఎన్నిసార్లు పుట్టినా, ఎన్నిసార్లు మరణించినా నీబుద్ధి నిర్మలం అవ్వకపోతే, నీ మనస్సుకు ఏకాగ్రత రాకపోతే ఆ వస్తువుకు సంబంధించిన అనుభవం రానేరాదు. వేలాది శరీరాలు రావచ్చును కాని ఆవస్తువు నీకు తెలియదు. ప్రకృతి ప్రవాహములో కొట్టుకొనిపోతూ ఉంటావు. ఎవరూ నిన్ను దరిచేర్చలేరు. నీ ఇంద్రియాలను నిగ్రహించుకోవటం నీకు ఇష్టంలేకపోయినా, నీ మనస్సుయొక్క చాపల్యం తగ్గించుకోవటం నీకు ఇష్టంలేకపోయినా నీ హృదయంలో ఉన్న అంతర్యామిని అనుభవంలోనికి తెచ్చుకోవటంకోసం నీ ఇంద్రియాలను నియమించుకో, మనస్సును నిగ్రహించుకో, స్వార్థాన్ని తగ్గించుకో అని ఆచార్యులవారు చెపుతున్నారు. ఇతరులకోసం సాధనచేయకు. నీవు బాగుపడటానికి చూసుకో, సంసారంఅనేది మహాసముద్రం. కెరటాలు కొడుతోంది. పుట్టటం ఒక కెరటం, చావటం ఒక కెరటం. ఈ కెరటాలమధ్య నువ్వు నలిగిపోతున్నావు. నీవు నిర్లక్ష్యంగా ఉంటే, బద్ధకంగా ఉంటే, బలహీనంగా ఉంటే ఈ సంసార సముద్రంలోనుండి బయటకు రాలేవు. భగవంతునియందు భక్తి కలిగిఉండు, గౌరవం కలిగిఉండు, వినయం కలిగిఉండు. నీకు రూపం ఉన్నప్పటికీ రూపం లేకుండా నీలోపల అంతర్యామిగా ఉండి ఎవడైతే నిన్ను నియమిస్తున్నాడో వాడిని శరణు వేడుకుంటె నెమ్మదిగా, సేఫ్‌గా ఒడ్డుకు వచ్చేస్తావు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. వాడు ఎక్కడయితే ఉన్నాడో మీరుకూడా అక్కడ ఉండటం నేర్చుకోండి. జన్మలకు కారణమైన జీవుడిని హృదయంలో ఉంచండి, హృదయంలో ముంచండి. వాడిని హృదయంలో ఉంచితే, ముంచితే వాడు కరిగిపోతాడు. వాడు కరిగిన వెంటనే మీ హృదయంలోఉన్న అంతర్యామి మీకు తానుగా వ్యక్తమవుతాడు.

మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది నిజమైన నేనుకాదు. అది మిథ్యానేను, దేహానికి పరిమితమైన నేను. ఈ మిథ్యానేను నిజమైననేనులోనుండి వచ్చింది. ఈ మిథ్యానేనుకు, నిజమైననేనుకు ఎటువంటి సంబంధం అంటే బుడగకు, సముద్రానికి ఉన్న సంబంధంలాంటిది. బుడగపోతే సముద్రంలో కలిసిపోతుంది. అలాగే మిథ్యానేను పోతే నీవు పోవు. అది ఆత్మ అవుతుంది. అప్పుడు నీవు శాంతిలో కూరుకొనిపోతావు. శరీరం అల్పకాలం ఉండి రాలిపోతుంది. చిరకాలం ఉండదు. తినటానికి తిండి ఉన్నా, ధనం ఉన్నా భోగాలు ఉన్నా అది చిరకాలం ఉండదు. స్వల్పకాలం ఉండి బయటకు పోతుంది. అల్పకాలంఉండి బయటకు పోయే ఈశరీరాన్ని నిజం అనుకోవటంవలన, ఆత్మకానిదానిని ఆత్మ అనుకోవటంవలన నీవు ప్రమాదంలో పడుతున్నావు. పాముని చూసి తాడు అనుకొని పట్టుకొంటే నీగతి ఏమౌతుందో దేహాన్ని ఆత్మ అనుకోవటంవలనకూడా అటువంటి ప్రమాదమే కలుగుతుంది అంటున్నారు ఆచార్యులవారు. ఈ సృష్టిలో అనేకరకాల బాధలు ఉన్నాయి, కష్టాలు ఉన్నాయి. ఎవరికి ఏకష్టం వచ్చినా, ఏ నష్టం వచ్చినా, ఏ బాధవచ్చినా వీటి అన్నింటికి నూటికి నూరుపాళ్ళు దేహబుద్ధే కారణం. దేహబుద్ధివలననే ఈ కష్టాలు అన్నీ వస్తున్నాయి అని ఎన్నిసార్లు చెప్పాలి. నీ ఇంద్రియాలతో విషయాలను అనుభవిస్తూ చనిపోయేవరకూ దేహబుద్ధిని పెంచుకొంటూఉంటే ఇంక నీకు జ్ఞానం ఏమిటి అంటున్నారు ఆచార్యులవారు. భగవంతుడు

ఇచ్చిన ఇంద్రియములను, భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను దేహబుద్ధి నశింపజేసుకోవటానికి ఉపయోగించుకోవటంలేదు. దేహబుద్ధిని పెంచుకోవటానికి ఉపయోగించుకొంటున్నావు. దేహబుద్ధి పెరిగిపోవటంవలన ప్రమాదంలో పడతాముఅని నీకు తెలియటంలేదు. దేహబుద్ధి నశిస్తేగాని ఆత్మబుద్ధి కలుగదు. ఈ జన్మలో ఒకబాధ ఉండవచ్చు. ఈ జన్మలో దేహబుద్ధి నశించలేదు అనుకో వచ్చేజన్మలో ఇంకోబాధ ఉంటుంది. అప్పుడుకూడా దేహబుద్ధి నశించదు అనుకో మరొక జన్మలో మరొకబాధ ఉంటుంది. దేహబుద్ధి నశించే వరకూ ఇలా ఏదోరకమైన బాధలు వెంటాడుతూ ఉంటాయి. ఇందులో రాజీలేదు. సాలిపురుగు దానినోటినుండి వచ్చే దారముతో గూడుకట్టుకొని అందులో బంధింపబడుతోంది. దానినోటివెంట వచ్చే దారమే దానికి జైలుక్రింద ఉపయోగపడుతోంది. అలాగే నీ ఇంద్రియాలద్వారా నీవు అనుభవించే భోగజీవితమే నీకు జైలును తయారు చేస్తోంది. ఆ జైలులో కూరుకొనిపోతున్నావు. నీ దేహబుద్దే నీకు జైలు. నీ జైలును నువ్వే నిర్మించుకొంటున్నావు. అందులోనుండి బయటకు రాలేకపోతున్నావు. దీనికి గురువుయొక్క సహాయం అవసరము. సంసారయంత్రంలో తగులుకొన్న జీవులను సంసారయంత్రంనుండి తప్పించి లోపల ఉన్న అంతర్యామిలో ఐక్యంచేయటానికి ప్రయత్నం చేసేవాడే గురువు. ఇతరుల గొడవలలోనికి వెళ్ళవద్దు మీపని మీరు చూసుకోండి. వారు సాధన చేయటంలేదు మేము ఎందుకు చేయాలి అని ఇటువంటి గొడవలలోనికి వెళ్ళకండి. మంచితనం ఉన్నవారికి, పూర్వపుణ్యం ఉన్నవారికి, వివేకవంతులికి వారి హృదయంలో ఉన్న అంతర్యామిలో ఐక్యం అవ్వాలనే బుద్ధి కలుగుతుందిగాని అందరికి కలుగనే కలుగదు.

మూఢత్వంలో ఉన్న మనిషి ఏదైతే లేదో అది ఉంది అనుకొంటాడు. ఏదైతే ఉందో అది లేదు అనుకొంటాడు. ఎదుటివారిలో మంచిని చూడగలిగితే మీలో మంచితనం ఉన్నట్లుగుర్తు. ఎదుటివారిలో చెడ్డను చూస్తూఉంటే మీలో చెడ్డ ఉంది అని వేరే చెప్పనక్కరలేదు. నిజంకానిదానిని నిజం అనుకొన్నంతకాలం అనేక వికారాలు, ఆకర్షణలు, మానసిక ఒత్తిడులు నిన్ను వెంటాడుతూ ఉంటాయి. సత్పురుషులతో సహవాసం చెయ్యి, పుణ్యక్షేత్రాలను దర్శించు. అప్పుడు మోహం నశిస్తుంది. మోహం నశించినపుడు వస్తువు ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. నీ హృదయంలో ఒకనిజం ఉంది అది లేదు అనుకొంటున్నావు. అల్పకాలం ఉండే ఈ శరీరాన్ని నువ్వే అనుకొంటున్నావు. నువ్వుకానిదానిని నువ్వు అనుకోవటమే బంధం. మనందరము తెలివితక్కువవాళ్ళము అంటున్నారు ఆచార్యులవారు. నీదేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు. నీకు వివేకం లేకపోవటంవలన అలాగ అనుకొంటున్నావు. నువ్వు ఎవరు ఆత్మవి. ఆత్మనీకు తెలియటంలేదు. తెలియనివాడివి తెలియనట్లు ఉండటంలేదు. కాని దేహాన్ని ఆత్మ అనుకొంటున్నావు. దేహాన్ని ఆత్మ అనుకోవటంవలన కోరిక, వికారము, కోపం అన్నీ వస్తున్నాయి. దేహం నీవు కాదు, దేహం నీవు కాదు అని నేను చెప్పటం ఎందుకు నీకే తెలుస్తోందికదా. గాఢనిద్రలో నీదేహంతోటి, నీ మానసికమైన గొడవలతోటి నీవు విడిపోతున్నావు. నీవు ఏదైతే కాదో అందులోనుండి గాఢనిద్రలో విడిపోతున్నావు. దేహమే నువ్వు అయితే గాఢనిద్రలోకూడా నాకు ఒకదేహం ఉంది అని నువ్వు అనుకోవాలి. కాని గాఢనిద్రలో దేహం గొడవగాని, ప్రపంచం గొడవగాని నీకు లేదు. కాని గాఢనిద్రలో నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది. గాఢనిద్రలో ఎవడో ఒకడు ఉన్నాడు. ఈజన్మలతోగాని, నీ గొడవలతోగాని సంబంధం లేకుండా స్వతంత్రముగా ఒకడు ఉన్నాడు. వాడు ఎవడో నీకు తెలియకపోవచ్చు కాని వాడిలోనుండి నువ్వు వేరుపడలేవు ఎందుచేతనంటే వాడే నువ్వు కాబట్టి. గాఢనిద్రలో ఎవడైతే ఉన్నాడో వాడు ఇప్పుడు జాగ్రదావస్థలోకూడా ఉన్నాడు. నీవు సాధనచేసి ఆగాఢనిద్రలో ఉన్నవాడిని జాగ్రదావస్థలో ఎరుకలోనికి తెచ్చుకొంటే నిన్ను ఇప్పుడే ఇక్కడే మోక్షం వరిస్తుంది. అదే కడసారి జన్మ.

అహంభావనను తగ్గించుకోండి. మంచి స్నేహితులు దొరకకపోతే మంచి పుస్తకాలు చదవండి. దానివలన

చైతన్యస్థాయి పెరుగుతుంది. మీరు చేసేపనులు ప్రేమగా చెయ్యండి, ఏకాగ్రంగా చెయ్యండి. దేవునికి ఏదైనా ఫలం, పుష్పం ఇచ్చేటప్పుడు ఎంత భక్తిగా ప్రేమగా ఇస్తారో అలాగే మీ ఇంట్లోచేసే చిన్న చిన్నపనులుకూడా అంతప్రేమగా భక్తిగా చేయండి. సాధన చెయ్యటానికి భయపడకండి. ఈశ్వరుడుని ప్రేమిస్తూ ఉంటే, ఈశ్వరుడిపట్ల భక్తి కలిగితే, విశ్వాసం కలిగితే ఈచిన్ననేను నశించిపోతుంది. నీదేహమును, నీ మనస్సును వశంచేసుకొంటే నీ హృదయంలోఉన్న అంతర్యామిని తెలుసుకోవటానికి అవి నీకు సహకరిస్తాయి. ఆహారవిషయంలో జాగ్రత్తగా ఉండు, నీ శరీర యాత్రకు సరిపడ తిను. ఎక్కువ గుంపులలోనికి వెళ్ళవద్దు. కొంతమంది భోజనం చేసి చెయ్యికడుక్కొని పదిమందిలోకి వెళ్ళిపడిపోతారు దానివలన లోకవాసన పెరిగిపోతుంది. అవసరం లేకుండా ఎక్కువజనంలోనికి వెళ్ళకు. సాధ్యమైనంతవరకూ ఏకాంతముగా ఉండటానికి ప్రయత్నంచెయ్యి. ఇతరుల వ్యవహారములలో కలుగచేసుకోవద్దు. దానివలన అహంభావన పెరుగుతుంది. నీవు సత్వగుణాన్ని పెంచుకో, వివేకాన్ని పెంచుకో. సత్యానికి అసత్యానికి ఉన్న బేధాన్ని గ్రహించటానికి ప్రయత్నం చెయ్యి. నీ మనస్సును మిత్రుడుగా చేసుకొంటే అదే నీకు ఉపకారం చేసిపెడుతుంది. నీ శరీరం స్మశానంవరకూ వస్తుంది. నీవస్తువులు ఇంట్లో ఉండిపోతాయి. శరీరం పడిపోయిన తరువాత మనస్సు నీకూడా వస్తుంది. నీ శరీరానికి, నీ బట్టలకు ఇచ్చే విలువ, ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువులకు ఇచ్చే విలువకూడా మరణానంతరము నీకూడా వచ్చే మనస్సుకు ఇవ్వావా? మనస్సును శాంతిస్థానంలో ప్రవేశపెట్టటానికి నీవు ప్రయత్నం చేయవా? మీ బట్టలమీద దుమ్ము పడకుండా ఎలా కాపాడుకొంటున్నారో అలాగ మీమనస్సులో దుర్వాసనలు పడకుండా చూసుకోవాలి అని మీకు తెలియదా? మీ మనస్సును నిర్మలం చేసుకోవటానికి, ఏకాగ్రం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి.

హృదయంఅంటే ఏమిటి అని అడిగితే ఎక్కడనుండి అయితే మనం వస్తున్నామో, ఎక్కడయితే ఉంటున్నామో, ఎక్కడయితే లయమవుతున్నామో అదే హృదయం అని చెప్పారు భగవాన్. అయితే దానిని ఊహించమంటారా అని దేవరాజ్ మొదలియార్ అడిగారు. ఊహించమని నేను చెప్పటంలేదు, నమ్మమని అనటంలేదు. ఊహించవద్దు అని చెపుతున్నాను అయితే ఎలాగ తెలుస్తుంది అని మరల అడిగారు. నీకు తెలియనిదానిని వదిలివెయ్యి, నీకు తెలుసున్నది పట్టుకో. హృదయం ఎలా ఉంటుందో నీకు తెలియదు. దానిగొడవ వదిలివెయ్యి. ఈ నేను తెలుస్తోందికదా, ఈ నేను హృదయంలోనుండి వస్తోంది. ఈ నేనును ఉపసంహరించుకొని వెళితే దానిమూలంలోనికి వెళుతుంది. దానిమూలంలోనే నేను చెప్పిన హృదయం ఉంది. దాని మూలమే హృదయం. అందువలన ఊహించమని చెప్పటంలేదు. తెలుసున్నదానిని పట్టుకొని తెలియనిదాని దగ్గరకు వెళ్ళిపో. హృదయాన్నే చైతన్యం, దేవుడు, ఆత్మ అంటున్నారు.

**వ్యాసాశ్రమ పీఠాధిపతులైన శ్రీ విద్యానందగిరిస్వామి వారి అభిప్రాయము.**

రమణతత్వం బ్రహ్మాండమైనది. ఆయన చాలా గొప్పవారు. ఆయన అంతా తన అనుభవంద్వారా చెప్పారు. ఇక్కడ మనపద్ధతి శాస్త్రంమీద ఆధారపడి ఉంది. శాస్త్రం బాగా తెలిసినవారికి అది బాగుగా, తొందరగా అర్థమవుతుంది. వారు చెప్పినది అంతా శాస్త్రానికి విరుద్ధంగా ఏమీలేదు. ఆయన పూర్వజన్మలోనే చేయవలసిన సాధనలు అన్నీ చేసారు. ఆయన ఒకసారి మరణించి బ్రతికాడు. లోకరీతిలో మరణించి బ్రతకటమంటే విచిత్రంగా ఉంటుంది. కాని అక్కడ మరణించింది "మిధ్యానేను". తరువాత "అసలు నేను" స్ఫురణలోకొచ్చింది. వారిదగ్గరకు నెమళ్ళు, పిచ్చుకలు, కోతులు వచ్చి నిర్భయంగా చరించేవి. అంత సమభావన కలిగిఉండేవారు. వారికి నరం కేన్సరు వచ్చింది. వేరేవారు అయితే ఆబాధ భరించలేరు. కాని ఆయనలో ఆబాధ ఛాయలేమీ కనిపించలేదు. డాక్టర్లు ఆశ్చర్యపోయారు.